


# కథ

## పి.ప్రమీల

# బహుమతి

"హ్యాపీ బర్త్ డే టు యూ!"

ఉలిక్కిపడి కళ్లు తెరిచింది వందన. ఎదురుగా భర్త, పిల్లలు, ఆ పక్కనే అత్తగారు.

ఆశ్చర్యంతో గబుక్కున లేచి కూర్చుంది భర్త వైపు చూసింది.

"ఈ రోజు నీ పుట్టినరోజు కదా! సర్‌ప్రైజ్ చేద్దామని అమ్మని పిలిపించాను" అన్నాడు ఆనంద్ నవ్వుతూ.

"మమ్మీ! నీకింకో సర్‌ప్రైజ్ ఉంది. త్వరగా లేచి రెడీ అవు" అన్నాడు ఎనిమిదేళ్ల అర్జున్.

"అవునమ్మా! త్వరగా లేచి రెడీ అవు. నీ కోసమే వెయిట్ చేస్తున్నాం" అంటూ వందన దగ్గరగా వచ్చి భుజం మీద చెయ్యి వేస్తూ అంది లలిత.

అత్తగారి చెయ్యి గట్టిగా పట్టుకొంది వందన. ఒక రకమైన ధైర్యం. ఏదో తెలియని మనశ్శాంతిగా అనిపించింది వందనకి.

గోడమీద గడియారం వంక చూసింది. ఏడున్నర యింది. 'ఇప్పటి దాకా మెలకువ రాకుండా పడుకొన్నది తనేనా' అని ఆశ్చర్యం వేసింది.

"రాత్రంతా ఆలోచనలతో నిద్రపోలేదు సరిగ్గా నువ్వు. అందుకే మెలకువ రాలేదు" ఆమె మనసు చదివినట్లుగా అన్నాడు ఆనంద్.

"ఒక్క పది నిముషాల్లో రెడీ అయిపోతాను" అందర్నీ ఉద్దేశించి అంది వందన మంచం దిగుతూ.

అన్నట్లుగా పది నిమిషాల్లో కాకపోయినా పావుగంటలో స్నానం ముగించి బాత్రూమ్ నుండి బయటకు వచ్చింది వందన.

అప్పటికీ అక్కడ రెడీగా ఉన్న లలిత కోడలి చేతిలో ఒక చీర పెట్టి "కట్టుకొని త్వరగా రా!" అంది.

చీర వంక అత్తగారి వంక చూసింది వందన.

"తర్వాత నీకే తెలుస్తుందిలే" అని నవ్వుతూ బయటికి వెళ్లిపోయింది లలిత.

వందన చీర కట్టుకొని రెడీ అయి తలుపులు తెరవగానే అర్జున్, రవళి లోపలికొచ్చారు.

"మమ్మీ! కళ్లు మూసుకో. మళ్లీ మేం చెప్పేవరకు కళ్లు తెరవద్దు" అంది రవళి.

ఏదైనా గిఫ్ట్ ఇస్తారేమో అనుకొని కళ్లు మూసుకొని చేతులు రెండూ ముందుకు చాపి "ఊఁ!" అంది వందన.

పిల్లలిద్దరూ వందన చెరో చెయ్యి పట్టుకొని హాల్లోకి తీసుకొచ్చారు.

"ఇప్పుడు కళ్లు తెరువు మమ్మీ!" అన్నాడు అర్జున్.

కళ్లు తెరిచి చూసింది వందన. హాల్లో కొంతమంది పిల్లలు, పెద్దవాళ్లు ఉన్నారు.

"వీళ్లందరూ ఆశ్రమం నుండి వచ్చారు. ఇవాళంతా మనం కలిసి గడపబోతున్నాం" అన్నాడు ఆనంద్.

వందనకి అర్థమైంది అనాథాశ్రమం అనే మాట వాడకుండా వచ్చిన వాళ్ల మనసు నొచ్చుకోకుండా భర్త వాళ్లని పరిచయం చేసిన తీరుకి ఆమె ముగ్ధురాలైంది.

"నీ కోరిక తీరిందిగా! ఆర్యూ హ్యాపీనా" ఆమె భుజం మీదుగా తల ముందుకు వంచి అడిగాడు ఆనంద్.

కృతజ్ఞతగా భర్త వంక చూసింది వందన. దాదాపు నెల రోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తొచ్చిందామెకు.

* * *

ఆ రోజు సాయంత్రం పిల్లలు స్కూల్ నుండి రాగానే పోటాపోటీగా ఆ రోజు స్కూల్లో జరిగిన సంగతులు వివరించసాగారు.

"అమ్మా! ఈ రోజు మా స్కూలుకు కొంతమంది పిల్లలు వచ్చారు. వాళ్లందరికీ మా స్కూలు వాళ్లు బట్టలు, పుస్తకాలు ఇచ్చారు" అని చెప్పాడు అర్జున్.

"మమ్మీ! వాళ్లు పాటలు కూడా పాడారమ్మా. వాళ్లలో ఒకమ్మాయి ఎంత బాగా పాడిందో తెలుసా!" కళ్లు తిప్పుతూ అంది రవళి.

వందన మనస్సు ఒక్కసారిగా గతంలోకి వెళ్లింది. అయిదేళ్ల వయసప్పటి నుండి అనాథాశ్రమంలో పెరిగింది. ఆ అనుభవాలు తనకెన్నో పాఠాలు నేర్పాయి. తమకి కూడా లయన్స్ క్లబ్ వాళ్లు, స్కూళ్లవాళ్లు బట్టలు, పుస్తకాలు ఇచ్చేవారు.


టెన్త్‌క్లాస్ అవగానే చిన్నపిల్లలకి హోం ట్యూషన్స్ తీసుకొని ఆ వచ్చిన డబ్బు ఆశ్రమానికి ఇచ్చేది. డిగ్రీ పూర్తి కాగానే ఉద్యోగం వేట మొదలుపెట్టింది.


ఆ సమయంలోనే ఒక రోజు ఆనంద్ ఆశ్రమానికి వచ్చాడు. ఆనంద్ తల్లి లలిత ప్రతి సంవత్సరం కొంత డబ్బు, భర్త పేరుతో ఆశ్రమానికి విరాళంగా ఇచ్చేది. ఆ సంవత్సరం ఆమె బాగా జబ్బు పడి మంచాన పడటంతో ఆ పనికి ఆనంద్ వచ్చాడు మాటల సందర్భంలో. తల్లికి సేవ చేయటానికి సరైన వాళ్లు దొరకటం లేదని ఎవ్వరైనా తెలిసిన వాళ్లుంటే చెప్పమని ఆనంద్ అడగటం. ఆ ఆశ్రమ నిర్వాహకులైన బలరాంగారు. ఆశ్రమానికి ఆనంద్ వాళ్లు చేస్తున్న సహాయాన్ని వివరించి వందనకి అభ్యంతరం లేకపోతే ఆ బాధ్యతని స్వీకరించమనటం జరిగాయి.

తమకి అంత సాయం చేస్తున్న వాళ్లకి ఆమాత్రం సేవ చేయటం తమ కర్తవ్యమని భావించిన వందన అందుకు ఒప్పుకొని ఆనంద్ ఇంటికి వచ్చింది. తాము ఇచ్చేది విరాళానికి, ఈ పనికి ముడి పెట్టవద్దని దీనికి విడిగా ఎంతో కొంత ఇవ్వదలచానని, అందుకు ఒప్పుకోవలసిందని చెప్పాడు ఆనంద్.

ఆరు నెలల పాటు అదో తపస్సులాగా భావించి లలితకి సేవ చేసింది వందన. ఆనంద్ వేరే ఊళ్లో ఉండటంతో డబ్బు అజమాయిషీ అంతా లలిత, వందనకి అప్పచెప్పింది. ఎంతో సమర్థవంతంగా, నిజాయితీగా చేస్తున్న వందన వ్యక్తిత్వం లలితను ముగ్ధురాలిని చేసింది.

లలితకి పూర్తిగా నయమయి లేచి తిరగటం మొదలు పెట్టాక ఆశ్రమానికి వెళ్లిపోవడానికి బయలుదే





రింది వందన. లలితకి వందనని వదులుకోవటం ఇష్టం లేకపోయింది. ఆమె శాశ్వతంగా తన దగ్గరే ఉంటే బాగుండుననిపించి వందన అంగీకారంతో ఆమెని కోడలిని చేసేసుకుంది.పెళ్ళయిన కొత్తల్లో అత్తగారు ఆశతో అన్న మాటలు ఇంకా గుర్తున్నాయి వందనకి.

"నీకు పుట్టింట్లో గడపాలనే కోరిక కలిగినప్పుడు నా దగ్గరికి వచ్చెయ్యి. అత్తగారితో గడపాలనిపించినప్పుడు నాకు ఫోన్ చెయ్యి. నేను వస్తాను" అంది లలిత.

తను అక్కడికి వెళ్తే అది తన పుట్టిల్లు. ఆవిడ ఇక్కడకు వస్తే అది అత్తగారిల్లు. అత్త, అమ్మ రెండూ తనే అని సున్నితంగా చెప్పిన ఆవిడ మాటలకు చలించిపోయింది వందన.

పెళ్లయ్యాక తను కూడా యథాశక్తి అలాంటి ఆశ్రమాలకి తన వంతు సహాయం చేద్దామనుకుంది వందన. పదేళ్లు గడిచాయి కానీ ఏమీ చేయలేకపోయింది. ఈ రోజు పిల్లల మాటలతో ఆ కోరిక మళ్లీ తలెత్తింది.

ఆ రోజు రాత్రి భర్తను అడిగింది. 'సరే' అన్నాడు ఆనంద్. ఆ తర్వాత ఏదో బిజీలో ఉంది. అది పెద్దగా పట్టించుకోలేదు. వందన మళ్లీ అతన్ని అడగలేదు.

"వందనా!" భర్త చేతి స్పర్శతో ఈ లోకంలోకి వచ్చింది వందన. తన ఎదురుగా ఆ పిల్లలందరూ నిలబడి ఉన్నారు. వాళ్లల్లో కాస్త పెద్దగా ఉన్న అమ్మాయి. "హ్యాపీ బర్త్ డే ఆంటీ!" అంటూ చెయ్యి ముందుకు చాపింది. ఆ అమ్మాయి చేతిలో బొకే ఉంది.

అది అందుకుంటూ "థాంక్యూ! చాలా బాగుంది" అంది వందన చాలా సంతోషంగా.

"మేమే తయారుచేశాం ఆంటీ!" గొప్పగా చెప్పారు పిల్లలందరూ. వాళ్లందరూ ఇంచుమించు అర్జున్, రవళి వయస్సులోనే ఉన్నారు.

"కమాన్ పిల్లలూ! ముందు టిఫిన్లు చేసేద్దాం. ఆ తర్వాత ఆడుకుందాం" అని పిలిచాడు ఆనంద్.

పిల్లలందరినీ హాల్లో వరసనే కూర్చోపెట్టారు. అర్జున్, రవళి కూడా వాళ్ల మధ్యలో కూర్చున్నారు. ఆనంద్ వంటింట్లో నుండి రెండు స్టీల్ క్యాన్లు తీసుకొచ్చి హాల్లో పెట్టాడు. లలిత, వందన అవి తీసి వాటిలో ఉన్న ఇడ్లీలు, కారప్పొడి, కొబ్బరి చట్నీ ప్లేట్లలో పెట్టి పిల్లలందరికీ అందించారు. వేడి వేడి ఇడ్లీలు ఆవురావురంటూ తిన్నారు పిల్లలందరూ. వాళ్లు తినటం కాగానే పెద్దవాళ్లు కూడా తినేశారు.

ఆ తర్వాత క్యారంబోర్డ్, చెస్, చైనీస్ చెక్కర్ లాంటి గేమ్స్ తీసుకొచ్చి హాల్లో పెట్టాడు ఆనంద్. పిల్లలు వాళ్ల కిష్టమైనవి ఆడసాగారు. కొంతమంది తెలీని గేమ్స్ ఎలా ఆడాలో తెలుసుకున్నారు.

కొంతసేపు ఆడుకున్నాక ఆనంద్ పిల్లలందరికీ కొన్ని పోటీలు పెట్టాడు. వాటిలో గెలిచిన వాళ్లకి చిన్న చిన్న బహుమతులిచ్చాడు. వాటి ఖరీదు ఏ ఇరవై రూపాయలో, పాతిక రూపాయలో ఉండి ఉండవచ్చు. కానీ అవి అందుకునేటప్పుడు ఆ పిల్లల కళ్లల్లో మెరిసిన ఆనందం వెలకట్టలేనిది. గెలవని వాళ్లకి కూడా కన్సొలేషన్ ప్రైజులంటూ ఏదో ఒకటి ఇచ్చాడు ఆనంద్.

అప్పటికి ఒంటి గంట అయింది. ఈ లోపల ఆర్డరిచ్చిన భోజనాలు రానే వచ్చాయి. ఆనంద్ చేసిన ఈ ఏర్పాట్లన్నీ ఆశ్చర్యంతో చూస్తోంది వందన.

భోజనాలు చేస్తున్నప్పుడు పిల్లలందరికీ ఏమేం కావాల్లో కనుక్కొంటూ స్వయంగా వడ్డించారు

ఆనంద్, వందన. భోజనాలయ్యాక చిన్నపిల్లల సినిమా సి.డి. పెట్టాడు ఆనంద్. పిల్లలందరూ కూర్చుని చాలా ఆసక్తిగా చూశారు. బాగా ఎంజాయ్ చేశారు.

సాయంత్రం అయిదింటికి పిల్లలందరికీ మళ్లీ స్వీటు, బిస్కెట్లు, మిక్చర్ ప్లేట్లలో పెట్టి ఇచ్చారు. అదయ్యాక వాతావరణం కాస్త చల్లబడటంతో అందరూ మేడమీదకి వెళ్లారు. అందరూ చాపలు వేసుకొని కూర్చున్నారు.

పిల్లలు తమలో ఉన్న టాలెంట్స్ ప్రదర్శించసాగారు. కొందరు పాటలు పాడితే కొందరు డ్యాన్సులు చేశారు. ఒకళ్లిద్దరు మిమిక్రీ చేశారు. కొంతమంది డ్రాయింగ్ వేశారు. ఇలా ఎవరికి వచ్చిన విద్య వాళ్లు ప్రదర్శించారు. పెద్దవాళ్లు కూడా పిల్లలతో పాటు అల్లరి చేసి ఆనందించారు. వీటన్నిటితో టైమే తెలియలేదు ఎవ్వరికీ.

ఏడింటికి ఇంక వాళ్లు వెళ్తామని బయలుదేరారు. ఆనంద్ లోపలకి వెళ్లి కొన్ని ప్యాకెట్లు తీసుకొచ్చి వందనకిచ్చి పిల్లలకిప్పించమన్నాడు. అందులో మామూలు డ్రెస్‌లు కొన్ని ఉన్నాయి.

అర్జున్, రవళిలతోటి ఆ డ్రెస్‌లు ఇంకా, నోట్‌బుక్స్ బొమ్మల పెన్సిళ్లు ఆ పిల్లలకి ఇప్పించారు.

లలిత పిల్లలతో పాటు వచ్చిన పెద్దలు నలుగురికీ చీరలు ఇచ్చింది.


"అంకుల్! మాకు వెళ్లాలని లేదంకుల్!" అన్నాడు వాళ్లల్లో ఒక బాబు.

ఆనంద్ వాళ్లని దగ్గరకు తీసుకొని "మేము మళ్లీ మిమ్మల్ని పిలుస్తాము. మీరు బాగా చదువుకొని మంచి మార్కులు తెచ్చుకోవాలి" అన్నాడు.

వాళ్లందర్నీ ఆటో ఎక్కించి డబ్బులు కూడా తనే ఇచ్చేశాడు ఆనంద్. సంతోషంగా వెళ్తున్న వాళ్లని చూసి వందన మనసు తృప్తి పడింది.

"ఎలిజబెత్ రాణి కూడా ఇంత ఆనందంగా తన పుట్టిన రోజు జరుపుకొని ఉండదు. ఆ అదృష్టం మీ వల్ల నాకు కలిగింది" భర్త వంక ఆరాధనగా చూస్తూ అంది వందన.

ఇందులో నాదేమీ లేదు. అంతా అమ్మ ప్లానే. నీ కోరికని అమ్మతో చెప్పాను. సరే అంది ఎలా చేయాలో కూడా ప్లాన్ చేసింది. వాళ్లు ఉన్న చోటుకి వెళ్లి చెయ్యటమనేది అందరూ చేసే పని. దాని వల్ల వాళ్లకి లాభం ఉంటుందేమోగానీ సంతోషం ఉండదు. అదే వాళ్లకి మనింటికి తీసుకొస్తే ఆ మార్పు వాళ్లకి సంతోషాన్నిస్తుంది. అందర్నీ తీసుకొచ్చి చెయ్యలేము కాబట్టి కనీసం కొంతమందికైనా మనం చేతనైంది చేద్దాం అంది అమ్మ. ఆశ్రమానికి వెళ్లి వాళ్లతో మాట్లాడి పర్మిషన్ తీసుకున్నాను. ఇంతకీ నీ పుట్టిన రోజు బహుమతి ఎలా ఉంది" అని అడిగాడు ఆనంద్.



"చాలా బాగుంది" ఖరీదైన చీర కట్టుకుని నగలు పెట్టుకొని లైట్లు, కేకుల హడావిడితో చేసుకునే పుట్టిన రోజు కన్నా ఇది చాలా ఆనందాన్నిచ్చింది." మనస్ఫూర్తిగా అంది వందన.

"కానీ ఈ ఖర్చు..." సందేహంగా అడిగిన వందన ప్రశ్నకు నవ్వుతూ తల్లిని చూపించాడు ఆనంద్.

"నువ్వు మా ఇంటికొచ్చి పదేళ్లయింది. అందుకని పదివేలు ఖర్చు పెట్టి నీ పుట్టిన రోజు జరపాలనుకున్నాను. ఏం కొందామా అని ఆలోచిస్తుండగా వీడు ఫోన్ చేశాడు. అంతకన్నా ఆ డబ్బుకి సార్థకత లేదనిపించింది. అది నీ కోరిక ప్రకారం ఖర్చుపెడితే నీకు సంతోషంగా ఉంటుంది. నీ సంతోషమే కదా మాకు కావల్సింది. అన్నిటికీ ఖర్చు చూసుకున్నాక చివరికి మిగిలిన డబ్బులతో నీకు చీర కొన్నాను. నీకిప్పుడర్థమైందనుకొంటాను. ఇందాక ఎందుకలా అన్నానో" అంది లలిత.

అప్రయత్నంగా వంగి అత్తగారి కాళ్లకి దణ్ణం పెట్టింది వందన.

వందనని లేపి దగ్గరకు తీసుకుంది లలిత.

"అంతేలే! నీకు కోడలే కావాలి. ఆ కోడల్ని సంతోషపెట్టే కొడుకుతో పని లేదు" అలిగినట్లుగా అన్నాడు ఆనంద్.

"నువ్వు లేకుండా ఎలారా! నీ వల్లనేగా ఈ బంగారు బొమ్మ దొరికింది" రెండో చేత్తో కొడుకుని దగ్గరకు తీసుకుంటూ అంది లలిత.

తండ్రి బిక్కముఖం చూసి కిలకిలా నవ్వారు అర్జున్, రవళి.

"నానమ్మా! మీక్కూడా పుట్టినరోజుకి ఇలాంటి బహుమతే కావాలి" అన్నారు అర్జున్, రవళి ముక్తకంఠంతో.

"అలాగే! ఆనందం చాలు భగవంతుడా" అనుకుంటూ దేవుణ్ని ప్రార్థించింది వందన.

○

## సదాకి కితాబు

సదా ఈమధ్యనే బాలీవుడ్‌కి కూడా వెళ్లింది. 'క్లిక్' అనే సినిమాలో ఆమెతోపాటు శ్రేయాస్ తల్పాడే నటిస్తున్నాడు. ఈ సినిమాలో సదా చాలా బాగా నటించిందని, మంచి టాలెంటెడ్ నటి అనీ, ఆమెకి మంచి భవిష్యత్తు వుందని శ్రేయాస్ తల్పాడే తెగ పొగడ్తలు కురిపించేసాడీమధ్య. ఆ మాటలు విన్న సదా కూడా శ్రేయాస్ లాంటి గొప్ప నటుడు తనని పొగడ్డం అంటే మామూలు సంగతి కాదు కదండీ అంటూ నలుగురికీ చెప్పుకుని తెగ సంబరపడుతోంది.